పేరులో ఏముంది? అంటారు. కాని అంగీకరించడం ఒక పటాన సాధ్యం కాదు ఒకరు పెట్టినపేరు కిటక శతవిధాల మార్చుకొనేవారు జాస్తి. పేరు గొప్పగా ఉండాలన్న తాపత్రయం ఒకటి అందుకు కారణం—దానిలోనూ ప్రమాదం ఉన్నా. ఇతరుల అభిప్రాయాలకు తగని విలువ ఇవ్వడం మరొక కారణం. అలాంటప్పుడు అసలంటూ పేరులో ఏముందో తెలుసుకొనేవారు ఉండరు.

పదేళ్ళ రామిని చూసి అందరూ వెక్కిరించేవాళ్ళు. ఒకరిద్దరు "ఆ ముదనష్టపు పేరే దొరికిందా, మీ అయ్యకు?" అనేవారు. రామికి ఇదేమీ అర్థం కాలేదు. తన పేరును వారు ఎందుకంత అసహ్యించుకొంటున్నారో ఊహించలేక పోయింది.

ఒక రోజు, తోటి పిల్లలతో ఆడుకుంటుండగా, అటే వెళ్ళుతున్న ఒకామె రామిని ఎగాదిగా చూసింది. అట్లా చూసి చూసి "పోలిక అంతా ఆ పాపిష్ఠి దానిదే" అంటూ వెళ్ళిపోయింది. అది విన్న వాళ్ళందరూ నవ్వారు. ఇంతలో అక్కడే కూర్చున్న సీతి తల్లి "పోలిక వస్తే వచ్చింది కాని, దాని బుద్ధులు రాకుండా ఉంటే బాగుపడుతుంది" అంది.

"రాకేడికిపోతుంది? పేరుగూడా దానిదేనాయిరి!" అన్నాడు వాళ్ళ తాత. తోటి పిల్లలలో కొద్దిగా పెద్దవాళ్ళు విరగబడి నవ్వారు. వారలా నవ్వటంతో ఏమీ తెలియకపోయినా, అర్థం కాకపోయినా మిగతావాళ్ళు కూడా శ్రుతి కలిపారు. దానితో రామికి చిన్నతనంవేసి తన గుడిసెకేసి పరుగెత్తుకు వెళ్ళింది.

అప్పుడే పొలంనుండి వచ్చిన ఆగమయ్యను "అయ్యా" అంటూ చుట్టుకుంది. అమాంతం తంక కెత్తుకున్నాడు రామిని, ఆగమయ్య. వెక్కి వెక్కి ఏడుపు మొదలుపెట్టింది రామి. అక్కడే కూర్చుని పొయ్యి ఊదుతున్న గంగి, కూతురి ఏడుపు విని ఆశ్చర్యంగా తలెత్తి చూసింది. "ఏమయింది? ఏదేమన్నరో సెప్పు. డొక్క సీంచుతా" అన్నాడు ఆగమయ్య, రామి జుత్తు విమురుతూ.

రామి బెక్కుతూ "నాకీ పేరొద్దొయ్యా. నాకు రామిపేరు తీసి యేరే పేరెట్టు" అంది. ఆగమయ్య నోరు తెరిచాడు ఆశ్చర్యంతో. "అంతా ఎక్కిరిస్తున్నారయ్యా, నాకా పేరొద్దు" అంది రామి మారాంగా. ఆగమయ్య వివరంగా తల వాల్చాడు. అది చూసిన గంగి రామిని బెదిరించింది.

"అసలు నాకా పేరెందుకు పెట్టారు? ఆ పేరు యారిది?" అంది రామి తల తిప్పుతూ. రామి ప్రశ్నకు ఉలిక్కి పడ్డాడు ఆగమయ్య. నెమ్మదిగా చెప్పాడు.

* * *

చిన్న గుడిసె చెట్ల మధ్యనుండి దీనంగా కనబడుతున్నది. గుడిసెపైన కప్పిన తాటాకులు ఎండకు ఎండి, వానకు వాని డసిలిపోయి ఉన్నాయి. గుడిసెకు ఒక పక్కగా ఉన్న తడిక తలుపు, తన పనినుండి విరమించ దలుచుకొన్నట్లు వీడిపోయింది. మట్టి గోడలనుండి ఉన్నట్లుండి అపుడో మట్టిపెల్ల, అపుడో మట్టిపెల్ల దభీమని కింద పడుతున్నాయి. గుడిసె ముందునుండి పరిగెడుతున్న మురుగు కాలువ దుర్గంధం చొరవగా గుడిసెలో ప్రవేశిస్తున్నది.

ఇంతలో ఆ గుడిసెనుండి ఒక వృద్ధుడు గొణుక్కుంటూ బయటికి వచ్చాడు. శరీరమంతా వణుకుతున్నది ముసలితనంవల్ల. నడుమంతా వంగిపోయింది. కంటిచూపు అంతగా లేదట్లు, అడుగులు జాగ్రత్తగా వేస్తూ సాగిపోతున్న ఆ వ్యక్తికేసి ఆ గూడెంవాళ్ళందరూ జాలిగా చూస్తున్నారు. అతడి వంకే చూస్తున్న గంగి వేడిగా నిట్టూర్చింది. అక్కడే నులక మంచంమీద పడుకొనిఉన్న ఒక ముసలివాడు చిరాకుగా గొణిగాడు: "ఎవరి కర్మ వారిది. ఊరికే అళ్ళవంక చూడటంతోనే సరిపోయె. ఏదో యింత గంజి మా మొహాన కొట్టేది

బతి

ఉందా?"

గంగి నవ్వగా నవ్వింది. "లే, అయ్యా. ఆ గిలా సియ్యి" అంటూ అక్కడే ఉన్న సొట్టలుపడి, బీటలువారిన గ్లాసు తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

గంజి కాచి తండ్రికి పోసి, మూలనఉన్న గంప ఎత్తుకొని బయటికి నడిచింది గంగి. వెళ్ళుతూనే "నే కూలి కెళ్తన్నానయ్యో" అని తండ్రికి వినపడేటట్లు కేకవేసింది.

"ఇంకా యీడనే ఉన్నావు, బిరాన పో" అని విసుక్కొన్నాడు ముసలాయన. గంగి తండ్రికేసి చూస్తూ వెళ్ళిపోయింది—"కూలికి యేళ అవుతాంది" అంటూ.

నడుస్తూందే కాని, ఆమె మనసంతా ఏవో ఆలోచనలతో నిండిపోయింది. 'నే నెంత కాళ్ళు కొట్టుకొని, సేతులు కొట్టుకొని పంపాయించినా, అయ్యకి సంతోసమే లేదు. ఇంకా, యింకా కావాలంటాడు. పాపం, ఎదురింటి మబ్బన్న తాత ఎంత ముసిలోడు! అయినా కూలికి పోతడు. కూలి ఎవరియ్యకపోతే సిల్లర పనులు సేస్తడు. తాత కొడుకు, దున్నపోతాలే వున్నడు. కాని పని సెయ్యడు. అయ్య తెస్తే తింటడు. తిరుగుతడు. అయినా తాత ఎంత మంచోడు! ఏమనడు వాణ్ణి' అని ఆలోచిస్తూ తల వంచుకొని, బిరబిరా నడుస్తున్న గంగికేసి తెరిపార చూస్తున్నారు, ఆ దారిన వచ్చే పోయేవారు.

పచ్చని కోక కట్టుకొని, ఎర్రరవిక వేసుకొని, సిగలో ఒక గన్నేరు పూవు ముడుచుకొని, కాలి కడియాలు గల్లు గల్లుమనిపిస్తూ నడిచి వస్తున్న గంగిని చూసి, ముందుకు నడిచాడు ఆగమయ్య.

"ఏందే, గంగీ, చాల సోకుమీదున్నవు" అంటూ క్రాపు సరిచేసుకున్నాడు దాని వెంటే నడుస్తూ.

గంగి నెమ్మదిగా నడిచింది, ఆగమయ్యను చూడనట్లు నటిస్తూ.

"ఏమంత బిరుసుగనున్నవు, యియ్యాళ" అన్నాడు నడక సాగిస్తూనే.

కోపంగా వెనుదిరిగింది గంగి. ముఖంమీద ఉన్న కాసంత కుంకుమ బొట్టు ఎర్రగా చూసింది ఆగమయ్యను. ముక్కున ఉన్న గజ్జెల పోగు గల్లుమంది.

"ఎంత సక్కనున్నవే, గంగి!" అన్నాడు ఆగమయ్య, కళ్ళప్పగించి చూస్తూ. దానితో గంగికి కోపం రెచ్చిపోయింది.

"ఓరయ్య! అయ్యకు పట్టెడు కూడెట్ల లేకోడివి, నీకు అందం, సందం కూడ ఎరికేనా?" అంది కసిగా.

ఆగమయ్య తేలికగా నవ్వాడు.

"నీ! సిన్నలేసోడా! ముసలయ్య కింత కూడెయ్యాల్సింది లేదు; అయ్య తెస్తే తని తిరుగుతావు? ఇంక పైకెళ్ళి, యీ పిచ్చి యాపాలేటికి?" అంది కళ్ళు పెద్దవి చేసి.

ఆగమయ్య నవ్వుతూ అన్నాడు : "గంగీ, నీపంటే నాకు సాల పేమే."

"పో పో. నీకంటే పని గిని లేదు. నా కెట్ల యితాంది? నేను కూలి పేమకు బతకాలి" అంటూ వడివడిగా వెళ్ళిపోయింది గంగి.

ఆగమయ్య, చేసేదిలేక వెనుదిరిగాడు. కడుపులో పేగులు ఆపురాపురు మంటున్నాయి. ఇంటికి వెళ్ళితే చెల్లెలు తప్ప అన్నం ఉండదు. తండ్రి వచ్చేదాకా, ఇంట్లో పొయ్యి విడ్డ పోతూనే ఉంటుందని తెలిసిన ఆగమయ్య పీడులన్నీ తిరుగుతూ గడిపాడు. సరిగా ఒంటి గంటకు గుడిసె చేరాడు.

గుడిసె అంతా అలికి ముగ్గు పెట్టింది రామి. ఉన్న కుండలన్నీ కడిగి పెట్టుకొని పొయ్యి కిందికి కావలసిన ఎండుపుల్లలు ఏరుకువచ్చి, గింజలకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

"బువ్వయిందా?" అన్నాడు ఆగమయ్య చెల్లెలికేసి చూస్తూ.

ఎల్. శారద

"అయ్యా ఇంకా రాలేదు" అంది రామి. ఆగమయ్య చిరాకుగా, మూలన ఉన్న నులక మంచం దభీమని వాల్చాడు, పడుకోవటానికి.

"అయ్యా వస్తేగాని గింజలు రావాయె! బువ్వేడి కెట్లొస్తది?" అంటూ రామి, ఆగమయ్య కేసి అదోలా చూసింది.

ఆ చూపులోని ఈసడింపును గుర్తించిన ఆగమయ్య చెల్లెలిమీదికి లేచాడు. ఆసలే ఆకలికి నకనకలాడుతున్నాడు. అందుకు కోపం మరింత ఎక్కువయింది. "ఏందే, కూస్తున్నవు? నీ మొగుడి సొమ్మేం పెడ్తన్నవా? జాగర్త. ఒళ్ళు పగలదంతా" అంటూ మీదిమీదికి పోయాడు.

ఇంతలో సుబ్బన్న లోపలికి వచ్చాడు. దానితో వెనక్కు తగ్గాడు ఆగమయ్య.

రామి సుబ్బన్న చేతిలో సంచి అందుకొంటూ, "పొద్దు పోయిందే, అయ్యా, యియ్యాళ?" అంది.

సుబ్బన్న చెమటలు తుడుచుకొంటూ చెప్పాడు. "మునలోడికి కూలి దొరకటం కట్టం కద, తల్లీ? ఏడకెళ్ళినా 'మునలోడివి, నీవేం సేత్తవు, తాతా?' అంటరాయె! ఏం సెయ్యాలె? అట్లనే ఏడో ఆడ, సూస్తున్నా; సేస్తున్నా" అన్నాడు.

రామి బాధగా నిట్టూరుతూ సొంబు దాకెయ్య టానికి పూనుకుంది. ఆగమయ్య కుర్చీమంచం

మీలికి చేరాడు. సుబ్బన్న కూడా కొడుకు పక్కకు వెళ్ళి కూర్చున్నాడు.

రామి, కుతకుత మంటున్న కుండవేసి చూస్తూ "రేపొచ్చినుంచి నే కూలి కెళ్తనయ్యా" అంది.

"అదోళ్ళు కూలి కెళ్ళదాదే" అని మాట మార్చాడు సుబ్బన్న.

"అదేందయ్యా, అట్లంటవు? గంగి, అచ్చి కూలి కెళ్తలేదా? అయినా యింకెన్నాళ్ళు కాళ్ళు కొట్టుకుంటవు, నువ్వు?" అంది రామి సాగదీస్తూ.

"ఊరే! కూడెట్టు." విసుక్కున్నాడు సుబ్బన్న.

రామి రెండు సత్తు కంచాల్లో అన్నంపెట్టి, కారం వేసింది. అరంగుళం వెడల్పున చిల్లులున్న ఆ కంచాల్లో ఎర్రగా ఉన్న మెద్దు బియ్యపు అన్నాన్ని కారంతో కలిపి, అదే అమృతంలా తిన్నారు తండ్రీ కొడుకులు. ఆగమయ్య కొసిరి కొసిరి పెట్టించుకున్నాడు. మంచి యువ్వనంలో ఉన్నాడాయె. అందుకు ఎక్కువ ధారక శక్తి ఉంది. పెడితే ఉన్న అన్నమంతా తిన గలడు. రామి విసుక్కొంటూ పెట్టింది.

వాళ్ళు తిని లేవగానే, కుండలో మిగిలిన వాలుగు మెతుకులు నాలికకు రాదుకొని లేచింది రామి. నెమ్మదిగా వంట చేసిన చోట శుభ్రం చేసి, కుండలు తోమి బోర్లించింది.

ఆగమయ్య మూలన ఉన్న చొక్కా వేసుకొని, మళ్ళీ బయటికి వెళ్ళిపోయాడు. సుబ్బయ్య కుంచంమీద పడుకు వాల్చాడు.

అంతలో గలగలమంటూ గంగి వచ్చింది. రామిని చూసి నవ్వుతూ పలకరించింది. నెమ్మదిగా సుబ్బన్న పక్కకు వెళ్ళి కూర్చుంటూ, "ఇంకెన్ని రోజు లిలా కాళ్ళు గొట్టుకుంటవు, తాతా? అయినా, నీ కొడుక్కి బుద్ధి సెప్పలేవా? పోయిగా కూసుని తినే రోజులు" అంది.

"అందుకే నే కూలి కెళ్తా అన్న" అంది రామి, అక్కడికి వచ్చి కూర్చుంటూ.

గంగి ముఖం చాటంతయింది. "రాయే, రామి! మా మేస్త్రయ్య సాల మంచోడే. నే సెప్పి నీకు కూలి యిప్పిస్తా. రేపు నాయెంట రా" అంది.

సుబ్బన్న తాత మాట్లాడకుండా ఊరు కున్నాడు.

మరునాడు గంగివెంట రామి బయలు దేరింది. "కూలికి గంప కూడా లేదే? ఎట్టా?" అంది బయలుదేరిన కొద్దిసేపటికి. దారిలో ఒక గంప కొని ఇచ్చింది గంగి. సన్నగా, పొడుగ్గా ఎర్రగా ఉన్న రామిని చూసి, వెంటనే కూలి పని ఇచ్చాడు మేస్త్రి జోగయ్య.

రామి నెమ్మదయిన మనిషి. ఎవరేమన్నా, తన పని తను చేసుకుపోయేది. ప్రతి రోజూ గంగి వెంటే వెళ్ళేది కూలికి. అక్కడ సిమెంటు రాళ్ళు, ఇటుకలు మోయటం; సిమెంటు, ఇసక నీళ్ళతో కలపటం; మేస్త్రీల

బలి

కందించటం మొదలయిన పనులు చేస్తూండేది. రామి మెతకదనం చూసి, అందరూ వెకిలి వేషాలు వేసేవాళ్ళు. మగ కూలీలందరూ, పరరాయించి చూస్తూండేవారు. అప్పుడప్పుడు ఏవేవో మాటలు సరసాలు ఆడుతుండే వాళ్ళు. కాని ఈ విషయా లేమీ గంగికి తెలియవు.

ఒక రోజు, గంగి ఎదట ఒక మగకూలి రామితో ఏదో పరాచిక మాడాడు. గంగి వెంటనే వాణ్ణి నాలుగూ దులిపేసింది. గంగి ఉత్త భోళామనిషి. రామిని ఎవరు, ఏమి అన్నా ఊరుకునేది కాదు. గంగి నోటికి జడిసి, దాని ఎదట రామిని ఎవరూ ఏమీ అనేవాళ్ళు కాదు.

మేస్త్రీ జోగయ్యకు రామిమీద మన సయింది. అది పని చేస్తున్నంతసేపూ దానివైపే చూస్తూండేవాడు. పైట బిగించి, కుచ్చెళ్ళు బొడ్లో ధోపి ఇసక, సిమెంటు కలుపుతుంటే కళ్ళార్పకుండా చూసేవాడు. మేస్త్రీ జోగయ్యకు పెళ్ళి అయింది. ముప్పయిమీద ఒక పదేళ్ళుంటాయి. పల్లగా పోత విగ్రహంలాగా ఉంటాడు.

ఒక రోజు, గంపలో ఇటుకలు మోసుకు వచ్చింది రామి. ఇటుక అందుకొంటూ మెల్లగా అన్నాడు జోగయ్య—"రేత్తిరి పొలాలకాడికి రా" అని. రామి గుండెల్లో రైళ్ళుపరుగెత్తాయి. నెమ్మదిగా గంప తీసుకొని అక్కడినుండి ఇటుక కుప్పలున్నచోటికి నడిచింది. అక్కడ ఉన్న గంగిని చూసింది. "నాకు ఎట్టగో ఉంది. ఒంటిల బాగ లేదు. నే నింటి కెళ్తన్న. మేస్త్రయ్యతో సెప్పు" అని గంగికి చెప్పి వెళ్ళిపోయింది. గంగి, జోగయ్యకు రామి చెప్పిన మాటలు చెప్పింది. జోగయ్య పెదాలు చప్పరించి ఊరుకున్నాడు.

ఆ రోజునుండి కూలికి రాలేదు రామి. వాకలు చేసిన జోగయ్యకు ఇంకోచోట కూలికి కుదిరి నట్లు తెలిసింది. అయినా అతనికి రామిమీద మనసు పోలేదు. రాత్రింబగళ్ళు రామిని గూర్చే ఆలోచించేవాడు. రామికి ఎన్నో కానుకలు పంపాడు. పూలు, పండ్లు, చీరలు, రవికలు ఎన్ని పంపినా అన్నీ తిరిగి వచ్చాయి. రామి తీసుకోలేదు.

ఒక రోజు జోగయ్య కదుతున్న ఇంటిలోనికి వచ్చాడు ఆగమయ్య. ఇసక మోసుకు వస్తున్నారు కొంతమంది. సిమెంటు సంచులు తెస్తున్నారు కొంతమంది మగకూలీలు. కొందరు ఇసక, సిమెంటు నీళ్ళుపోసి కలుపుతున్నారు. కొంతమంది కలిపిన మిశ్రమాన్ని గంపలకు ఎత్తుతున్నారు. గంగి పైట బిగించి, గంపలతో మిశ్రమాన్ని మోసుకువెళ్ళుతున్నది. ఆగమయ్య గంగివేపు ఓర కంటితో చూస్తూ నిలబడ్డాడు. గోడ కడుతున్న జోగయ్య అది గమనించాడు. మెరుపులాంటి ఆలోచన వచ్చింది జోగయ్యకు. చేసే పని వదిలిపెట్టి, ఆగమయ్యను పక్కకు తీసుకువెళ్ళాడు. దూరంగా వెళ్ళి ఏవేవో మాట్లాడాడు. ఆగమయ్య ముఖం చీటంత అయింది. జోగయ్య చెప్పిన మాటలకు తల ఊపి వెళ్ళిపోయాడు.

జోగయ్య తృప్తిగా నవ్వుకుంటూ తన పని లోకి వెళ్ళాడు. తాపీతో ఇటుకలమధ్య వేసిన సిమెంటును రుద్దుతూ కూర్చున్నాడు. ఇంతలో గంగి ఇటుకలు మోసుకువచ్చింది. గంగిని ఒక నిమిషం చూసి "గంగీ, ఆగమయ్య అంటే ఇష్టమేనా?" అన్నాడు. గంగి సిగ్గుతో తల వాల్చింది. "నీవంటే చాలా మగసు పడుతున్నాడు" అన్నాడు తిరిగి జోగయ్య. "ఆ మొద్దు నా మెడ కేటికి?" అంటూ గంప తీసుకు వెళ్ళిపోయింది గంగి.

వారం రోజులపాటు సుబ్బన్న పొరుగూరు వెళ్ళాడు. వెళ్ళుతూ, తన ఇంటిని కనిపెట్టి ఉండమని గంగిని హెచ్చరించాడు.

సుబ్బన్న ఊరు వెళ్ళిన మరునాడు సాయంత్రం, రామి ఏదో పని చేసుకుంటున్నది. అంతలో ఆగమయ్య వచ్చాడు. భోజనానికి అంత త్వరగా వచ్చిన అన్నను చూసి ఆశ్చర్యపోయింది రామి. "అన్నమయింది. కారం నూరి పెడతా" అంది నెమ్మదిగా. "తొందరలే. మెల్లంగా కానియ్యి" అన్నాడు. అన్న మాటల్లో ఎన్నడూ లేని మెత్తదనానికి వింతపడ్డది రామి. ఆగమయ్య అడేమీ గమనించటట్లు, "నూడే, రామి! ఇట్టంలో మంచి ఆట వచ్చిందంట. యెల్దామా" అన్నాడు. రామికి సినిమాలంటే చాలా ఇష్టమని ఆగమయ్యకు తెలుసు.

ఆట అనగానే, రామి ముఖంలో వెన్నెలలు విరిగినట్లయింది. "ఏమాట? ఏడి కొచ్చింది?" అంది, ఆశగా చూస్తూ.

"ఏదో ఆటనే. పేరు మర్సిపోయా. మంచా టేలే" అన్నాడు ఆగమయ్య.

"మరి దుడ్డో?"

"నే నిచ్చుకొంటా."

"నీతాన ఏడిది?" అంది అనుమానంగా రామి.

ఆగమయ్యకు కోపం వచ్చినా అణుకున్నాడు. "ఏం నాతాన ఉండదా? కూలిసేసి, సంపాయించిన, యియ్యాళ" అన్నాడు ఆగమయ్య. రామి మరేమీ మాట్లాడకుండా కొద్దిసేపు ఆలోచించింది.

కొంతసేపటికి అన్నవంక చూస్తూ అడి

గుణారాలు

చిత్రం—కె. ఎస్. బాలసుబ్రహ్మణ్యం
(మద్రాసు-7)

గింది: "అయ్యకు తెలిస్తే?"

ఆగమయ్య నవ్వాడు. "తెల్వదు. యాడు సెప్పుతరే. బిరాన తయారుగా. ఎల్దాం. మొద టాటకు ఎల్దాం. ఎవరూ సూడరు."

"అయితే మళ్ల వచ్చి తిందామా" అంట తయారయింది రామి.

పట్టుచీర కట్టుకొని, వంగపువ్వు రంగు చీర కట్టుకొని, సిగలో మందారపువ్వు తురుము కొని, నుదుటిమీద కాసంత కుంకుమ బొట్టు పెట్టుకొని తయారయింది. కళ్ళకు కాటుక పెట్టుకొని, అద్దంలో చూసుకొని మురిసి పోయింది. రామి అమాయకత్వానికి నవ్వు కొంటూ, "ఇక పోదామా" అన్నాడు ఆగమయ్య.

ఆగమయ్య వెంట బయటికి నడిచింది రామి. ఎవరి పనులలో వారు ఉండి, ఎవరూ గుర్తించ లేకపోయారు వాళ్ళను.

రామిని పట్నంలో వీధులన్నీ తిప్పుతున్నాడు కాని, సినిమా మాట ఎత్తలేదు ఆగమయ్య. రామి పట్నంలో వింతలన్నీ చూస్తూ సినిమా మాట మరిచిపోయింది. కాని గుర్తు వచ్చినప్పుడు, మధ్య మధ్య "అట సూపిస్తనంటివి కద" అంటూనే ఉంది. బజారులోని వింత వింత బట్టలను, రంగు రంగు చీరలను చూస్తూ నడుస్తూంది రామి. నగల షాపులవంక, మిల మిలా మెరిసే వెండి సామగ్రివంక నోరు తెరు చుకు చూసింది. చెప్పుల షాపుల్లో ఉన్న రకరకాల చెప్పులను ఆశగా చూసింది. మిఠాయి దుకా ణంలో, అద్దాల్లోనుండి కనబడుతున్న మిఠాయిల వంక చూస్తూంటే నోరూరింది. నెమ్మ దిగా ముందుకు నడిచింది అన్నతో. ఒక షాపులో రకరకాల సందులున్నాయి. వాటివంక విచిత్రంగా చూసింది. పక్కనే ఉన్న కొట్టులో నుండి పౌడరు డబ్బాలు, స్నో సీసాలు, సెంట్లు, అత్తరుబూనెలు, సబ్బులు తొంగి చూస్తూంటే వాటివంక నిస్పృహగా చూసింది రామి. ఇంకొక షాపులో రకరకాల పుస్తకాలు, కలాలు, సిరా బుడ్లు ఉన్నాయి. పుస్తకాలమీద ఉన్న రకరకాల బొమ్మలనేసి చూస్తూ ముందుకు సాగింది రామి.

ఎన్నో హోటళ్ళు, పూల దుకాణాలు, పండ్ల దుకాణాలు, రకరకాల వస్తువులతో నిండిన కొట్లు కనపడ్డాయి. వాటి నన్నిటినీ చూస్తూ నడుస్తున్న రామికి కాలమే తెలియలేదు.

రాత్రి అవయింది. నెమ్మదిగా కొట్లన్నీ మూసివేస్తున్నారు. 'కాళ్ళు గుంజుతున్నాయి' అనుకుంటూ ముందుకు సాగింది రామి. కాని తన వెంట ఆగమయ్య లేడన్న సంగతి గుర్తించలేక పోయింది. బజారులో మనుషులు పలచబడ్డారు. దాంతో ఈ లోకంలోకి వచ్చిపడింది రామి. "ఇక యింటికి పోదామా" అంటూ ముందుకు చూసింది. ఆగమయ్య కనపడలేదు. దిక్కు లన్నీ పరకాయించి చూసింది. కాని ఆగమయ్య లేడు. రామి గుండెలో రాయిపడింది. ముక్కూ ముఖం తెలియని పట్నంలో ఒంటరిగా వదిలి వేయబడటంతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెనుదిరిగి చూసింది. పరిచితమైన ముఖం కనపడింది. కళ్ళు పెద్దవిచేసి చూసింది. తన వైపే వస్తున్న అతడు జోగయ్య అని తెలుసు కుంది. పోనీ, తెలిసిన వ్యక్తి ఒక్కడైనా ఉన్నా డనుకొని కుదుట పడింది. అంతలోనే ఆమె మనసులో ఏదో భయం మెదిలింది.

అంతలో జోగయ్య దగ్గరికి వచ్చాడు. "ఏమే, రామి!" అంటూ పలకరించాడు. రోడ్డు మీద బావురుమంది రామి. జోగయ్య ఇంకేమీ మాట్లాడకుండా "ఇంటిదగ్గర దింపుతా. పద" అన్నాడు. పోయిన ధైర్యం వచ్చింది రామికి. నెమ్మదిగా జోగయ్యను అనుసరించింది. బజారు లన్నీ దాటి సిమెంటు బాట చేరారు. బాట అంతా నిర్మానుష్యంగా ఉంది. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చెట్లు కొమ్మలు గాఢంగా అల్లు కున్నాయి. వెలుగు ఎక్కడా లేదు. రామి కేదో భయంవేసి, "బస్సుమీద పోదాము" అంది. జోగయ్య మాట్లాడకుండా వెనుదిరిగాడు. రామిని తన చేతుల్లో బంధించివేశాడు. "రామీ" అంటూ దాని చెవిలో రహస్యంగా ప్రేమ అంతా వెళ్ళబోశాడు. రామి పెనుగులాడింది. అర వాలని ఎంత ప్రయత్నించినా నోరు పెగల లేదు. చేతులలో సత్తువ ఉన్నంతమటుకు పెనుగులాడింది. కాని జోగయ్య బలం ముందు రామి బలం దాసోహమంది.

* * * *

జోగయ్య "ఇక పోదామా" అన్నాడు. రామినుండి జవాబు లేదు. నెమ్మదిగా పక్కకు చూశాడు. రామి కనపడలేదు. జేబునుండి అగ్గి పెట్టె తీసి, పుల్లగీసి ఆ వెలుతురులో చూశాడు. రామి లేదు. భయ సందేహాలతో కాలువవేపు చూశాడు కొద్దిసేపు. తరువాత చీకటిలో కలిసి పోయాడు.

మరునాడు రామి అంతరా సంగురించి ఊరంతా పొక్కిపోయింది. ఊరికి మూడుకోసుల దూరంలో, పట్నానికి పోయే దారిలో ఉన్న కాలువలో రామి శవం తేలింది. అంతా పరుగెత్తుకువెళ్ళి చూశారు. ఆగమయ్య గుండె మండింది. జోగయ్య ఇంటికేసి వెళ్ళాడు. కాని అప్పటికే పెళ్ళాం పిల్లలతో ఎక్కడికో వెళ్ళిపోయాడు జోగయ్య.

ఊరినుండి వచ్చిన సుబ్బయ్య కూతురు మరణానికి గుండె పగిలి చనిపోయాడు. ఊళ్ళో వాళ్ళందరూ రామిని నోటికి వచ్చిన మాట అన్నారు. వారి మాటలు విన్న ఆగమయ్యకు చెవుల్లో సీసం పోసినట్లయింది. చేసేదిలేక తనలో తనే కుంగిపోయాడు. గంగికోసం రామిని బలి పెట్టానే అన్న దుఃఖంలో అన్నం, నీళ్ళు మానివేశాడు.

అనుకోకుండా గంగి వచ్చింది ఒక రోజు. గంగి వేపు చూడకుండా తల తిప్పుకున్నాడు. "మావా, నన్నెందు కిట్టా యేరు సూపు సూస్తా"వని బావురుమంది గంగి.

ఆగమయ్య కసిగా అన్నాడు: "యిప్పొ కొచ్చిందా, నామీద మోజు?"

"లే, మావా. దేవుని మీ దొట్టు. నీమీద నా కెప్పుడూ మోజే. నీ విట్టుంటే నే సూడ లేను" అని ఆగమయ్యను పట్టుకొని, వెక్కి వెక్కి ఏడ్చిందిగంగి.

ఆగమయ్య కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వయ్యాయి. "నామీద నీకు మనసుందని ముందు తెలిస్తే రామి జోగయ్యకు బలియ్యేది కాదే. ఎట్టికి రామిని బలి పెట్టాను" అని పెద్దగా అరిచాడు ఆగమయ్య.

గంగి భయంతో వణికిపోయింది. "ఏమంటు న్నావు? నువ్వు....నువ్వు రామిని....." అంటూ మూర్ఛపోయింది గంగి. తరువాత ఎన్నో తిట్టింది. కానీ ఆగమయ్య కిమ్మనలేదు.

సినిమా రీళ్ళలా తిరుగుతున్న సంఘటనలను చెబుతున్న ఆగమయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అంతలో, కూతురు అంది: "అయితే, నాకు అత్త పేరు పెట్టావా, అయ్యా?"

మౌనంగా తల ఊపాడు ఆగమయ్య. బరు వుగా నిట్టూర్చింది గంగి.

నీళ్ళ బతుకులను చూసి వెర్రిగా నవ్వింది పొయ్యిమీద ఉన్న కుండ. పొయ్యికింద ఉన్న ఎండు పుల్లలు, మంటకు తాళలేక కసిగా చూశాయి ఆగమయ్య వంక. కాలుతున్న పుల్లలు గంగిని చూసి గరగరమని గొణిగాయి. అంతలో అగ్నిదేవుని ఎర్రని వాలుకలు వాటిని భస్మం చేశాయి. ★

కారణం

కేతినీడి భాస్కరరావు

గుండెలో గంటలు వాగటంలేదు
కారణం ఏమిటో తెలియటంలేదు.
ఆఫీసరు మొరగటంలేదు
కారణం ఏమిటో ఒకటుండ దెవుడూ.
రోడ్డుమధ్య జనం తిరగటంలేదు
కారణం మాత్రం తెలియటంలేదు.
పార్టీలులేవు ప్లేగ్ అంతకంటే లేదు
కారణం మాత్రం కనపట్టంలేదు.
బిచ్చగాళ్ళు అరుపులు లేవు
ఆకలి చావులు అంతకంటే లేవు
కారణం మాత్రం అగుపించింది—
గుండె ఆగి చాలాసేపయింది!
గుండెలో గంటలు వాగటంలేదు! ●